క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం



విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యబృందం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో నెల్లూరు మోడ్రన్ ఐ హాస్పిటల్ సహకారంతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి సమస్యలున్న వారికి మందులు, వైద్య సలహాలిచ్చారు. అనంతరం కంటి వైద్య నిపుణుడు జి.విష్ణుతేజ 'లాసిక్ లేజర్' కంటి శస్త్ర చికిత్సపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లాసిక్ లేజర్ టెక్నాలజీ ద్వారా కంటి శస్త్ర చికిత్స ఎంతో సులభతరమన్నారు. ఎలాంటి నొప్పి, సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. మెరుగైన కంటి చూపు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డాక్టర్ విష్ణు తేజను కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్, మోడ్రన్ హాస్పిటల్ వైద్య బృందం, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నానో డీఏపీపై దృష్టి సారించాలి



నానో డీఏపీ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: నానో డీఏపీపై రైతులు దృష్టి సారించాలని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ సూచించారు. నానో డీఏపీ ఆవశ్యకతపై బుధవారం మండలంలోని పాపిరెడ్డిపాళెంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నానో డీఏపీని వినియోగించడం వల్ల రైతులు ఎరువులపై పెట్టే ఖర్చు గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. గుళికల రూపంలో ఉన్న ఎరువులు రానున్న కాలంలో దొరకవని లిక్విడ్ రూపంలో ఉన్న ఎరువులు మాత్రం అందుబాటులో ఉంటాయని తెలిపారు. నానో డీఏపీని ప్రస్తుత రబీ సీజన్‌లో పాపిరెడ్డిపాళెంలో 20 మంది రైతులు 240 ఎకరాల్లో వినియోగించారని, తద్వారా ఆ రైతులు సత్ఫలితాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు షర్మిల తదితరులు పాల్గొన్నారు.

సీఎం బస్సు యాత్రకు గట్టి బందోబస్తు



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఏఎస్పీ సౌజన్య

మనుబోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లాలో చేపట్టనున్న బస్సు యాత్రకు మనుబోలు మండల పరిధిలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని జాతీయ రహదారిని బుధవారం అడిషనల్ ఎస్పీ సౌజన్య పరిశీలించారు. చెక్‌పోస్టును పరిశీలించి కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. హైవేపై ఏపీ పాయింట్ల వద్ద ఎంతమంది పోలీసులను ఉంచాలనే విషయాలపై ఆమె అధికారులతో చర్చించారు. ఆమె వెంట డీఎస్పీ వీరాంజనేయులురెడ్డి, ఆర్డీఓ మలోల ఉన్నారు.

వేగూరులో సీఆర్‌పీఎఫ్ జవాన్ల కవాతు



కోవూరు: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం కోవూరు మండలంలోని వేగూరు తదితర ప్రాంతాల్లో కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ పర్యవేక్షణలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా ధైర్యం నింపేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: బైక్‌ను ఆటో ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన వెంకటాచలంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి, తన భార్యతో కలిసి పనినిమిత్తం నెల్లూరుకు వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా వెంకటాచలం వద్ద బైక్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు కావడంతో చికిత్సనిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాకెందుకు ఈ అవస్థ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు వలంటీర్లు వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఎన్నికలు సమీపించిన క్రమంలో చంద్రబాబు, టీడీపీ అనుబంధ సంస్థల కుట్రతో వలంటీర్ల సేవలు నిలిచిపోయాయి. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులు సైతం పింఛన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి రావడంతో మాకెందుకు ఈ అవస్థ అంటూ వారు వాపోతున్నారు.

- పింఛన్ కోసం సచివాలయాల వద్ద అవ్వాతాతల పడిగాపులు



ముత్తుకూరు సచివాలయం వద్ద బారులుతీరిన పింఛన్‌దారులు

వెంకటాచలం: వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా చంద్రబాబు, టీడీపీ అనుబంధ సంస్థలు అడ్డుకోవడంతో వెంకటాచలం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద బుధవారం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. గ్రామ సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పడంతో వెంకటాచలం, సర్వేపల్లి, కసుమూరు, తిక్కవరప్పాడు, అనికేపల్లి, చెముడుగుంట తదితర గ్రామాల్లోని సచివాలయాల వద్ద ఉదయం 8 గంటల నుంచే అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. చంద్రబాబు కుట్రలతోనే వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి గత నెల వరకు ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే లబ్ధిదారులకు పింఛన్లు అందించేవారని, చంద్రబాబు దీనిని చూసి ఓర్వలేక ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయించారని లబ్ధిదారులు మండిపడుతున్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వెంకటాచలం సచివాలయం వద్ద పలువురు వృద్ధులు ఎండతీవ్రతను తట్టుకోలేక అస్వస్థతకు గురై, స్థానిక క్లస్టర్ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు.

పొదలకూరు మండలంలో..

పొదలకూరు: మండలంలోని సచివాలయాల వద్ద బుధవారం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ నగదు కోసం పడిగాపులు కాశారు. పింఛన్ కోసం లబ్ధిదారులు ఉదయాన్నే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాగా దివ్యాంగులు, వృద్ధులు ఎండతీవ్రతకు తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. లబ్ధిదారులు ఆటోలు, రిక్షాల్లో సచివాలయాలకు వెళ్లి వేచిచూసి పింఛన్లు తీసుకోవాల్సి వచ్చింది.

ఇందుకూరుపేట మండలంలో..

ఇందుకూరుపేట: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్లు తీసుకొనేందుకు సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సివస్తోంది. చంద్రబాబు పుణ్యమా అని పింఛన్‌దారులు మండుటెండలో గ్రామ సచివాలయాల వద్దకు వచ్చి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ కష్టాలు మాకు లేవని, చంద్రబాబు వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించిన తర్వాతే ఇలా ఇబ్బంది పడుతున్నామని పింఛన్‌దారులు వాపోతున్నారు.

బారులుతీరిన పింఛన్‌దారులు

ముత్తుకూరు: పింఛన్ కోసం బుధవారం లబ్ధిదారులు బారులుతీరడం టీడీపీ పాలనను గుర్తుచేసింది. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ నిలిపివేయడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు సచివాలయాలకు వెళ్లాల్సివచ్చింది. మండలంలోని 16 సచివాలయాల వద్ద ఉదయం నుంచి లబ్ధిదారులు వేచి చూడాల్సివచ్చింది. మధ్యాహ్నం ఉద్యోగులు నగదుతో వచ్చి పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు.

ఎర్రటి ఎండలో..

మనుబోలు: వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకూడదంటూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో గ్రామ సచివాలయాల వద్దే బుధవారం అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. అయితే ఇప్పటి వరకు వలంటీర్లు నేరుగా ఇళ్ల వద్దకే ఉదయాన్నే వచ్చి పింఛన్ తెచ్చి ఇచ్చేవారు. ఒక్కసారిగా ఈ విధానంలో మార్పు రావడంతో పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని గ్రామ సచివాలయాల వద్ద బుధవారం నుంచి పింఛను పంపిణీ చేస్తారని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. దీంతో ఉదయం నుంచే వృద్ధులు, వికలాంగులు సచివాలయాలకు చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం వరకు నగదు బ్యాంకుల నుంచి రాకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు ఎండ వేడిమికి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మందులకు డబ్బుల్లేవు

ముత్తుకూరు: మండలంలోని మామిడిపూడికి చెందిన పొన్నాడి సరోజనమ్మ అనే 87 ఏళ్ల వృద్ధురాలుకి ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఆ డబ్బులను మందుల కొనుగోలుకు, ఇతర అవసరాలకు ఖర్చు చేసుకునేది. అయితే, వలంటీర్లపై టీడీపీ కక్ష కట్టడంతో ఈ నెలలో సరోజనమ్మకు సకాలంలో పింఛన్ అందలేదు. ఏ రోజున ఎవరు వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తారో అని ఆమె ఎదురుచూస్తున్నారు.



పొదలకూరు: చెక్క రిక్షాపై సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకుంటున్న వృద్ధుడు



ఇందుకూరుపేట: మైపాడు సచివాలయం వద్ద లబ్ధిదారులకు పింఛన్ అవస్థలు



వెంకటాచలం సచివాలయం వద్ద పింఛన్ కోసం వచ్చి పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు



ముత్తుకూరు: పింఛన్ డబ్బుల కోసం నిరీక్షిస్తున్న సరోజనమ్మ



మనుబోలు: సచివాలయం బయట పడిగాపులు కాస్తున్న వృద్ధులు

చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తప్పదు



ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్లు పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. వలంటీర్లు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా ఇన్ని ఇబ్బందులు పెడుతున్న చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తప్పకుండా తగులుతుంది. చంద్రబాబు పాలనలో పింఛన్లు సక్రమంగా ఇవ్వలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రిమార్కు లేకుండా పింఛన్లు పంపిణీ చేస్తుంటే అడ్డుకోవడం, వృద్ధులను ఇబ్బంది పెట్టడం మంచిపద్ధతి కాదు. పింఛన్‌దారులంతా చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయం.

– ప్రకాష్, వెంకటాచలం

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

- మంత్రి కాకాణి కుమార్తె పూజిత



లింగంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పూజిత

పొదలకూరు: అభివృద్ధి చేసి.. ఓట్లు అడిగేందుకు వస్తున్నామని, సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత కోరారు. పొదలకూరు పంచాయతీ లింగంపల్లి, ఎస్సీకాలనీ, లింగంపల్లితోపు గ్రామాల్లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొదలకూరు బిట్–4 సచివాలయ పరిధిలో రూ.73.73 కోట్ల అభివృద్ధి పనులు, డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.30.60 కోట్లు అర్హులైన లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. ప్రతి కాలనీలో సిమెంటు రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ అరుణ, ఎంపీటీసీ సభ్యులు గుంటి శ్రీనివాసులు, జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు అంజాద్, మూలి సతీష్ రెడ్డి, హరి, భాస్కర్, నాయకులు జి.వేణుగోపాల్ రెడ్డి, తుమ్మల ప్రసాద్, దయాకర్‌రెడ్డి, భారతమ్మ, కొంగి లక్ష్మయ్య, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి గీతారెడ్డి తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే అన్ని సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగుతాయని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతా రెడ్డి అన్నారు. బుధవారం ఆమె తన కోడలు పూజితారెడ్డితో కలిసి బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించే ప్రసన్నకుమార్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కన్వీనర్లు మల్లి కార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, నగర పంచాయతీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ గిరిజనకాలనీలో..

నగర పంచాయతీ పరిధిలోని ఇస్కపాళెం గ్రామం మజరా రాయలసీమ గిరిజనకాలనీలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మంజుల, పి.ఆదిశేషయ్య పాల్గొన్నారు.

వలంటీర్ల సామూహిక రాజీనామాలు



కొడవలూరు: పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

కొడవలూరు: కొడవలూరులో 21 మంది వలంటీర్లు సామూహిక రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారి రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణకు బుధవారం అందజేసి మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు ఇంటి వద్దకే అందిస్తున్న వలంటీర్ల సేవలను నిలిపివేయడం చంద్రబాబు కుట్ర అని పేర్కొన్నారు. పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న అవస్థలను చూస్తుంటే బాధగా ఉందన్నారు.

మూకుమ్మడిగా..

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేటలో 35 మంది, లేబూరు గ్రామంలో 14 మంది వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందజేశారు.



ఇందుకూరుపేటలో రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



లేబూరులో రాజీనామా చేస్తున్న వలంటీర్లు

మంత్రి కాకాణి పరామర్శ



ఉమ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: కుమార్తెను కోల్పోయిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమవరపు బాలకృష్ణారెడ్డిని బద్దెవోలులోని ఆయన నివాసంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. బాలకృష్ణారెడ్డి కుమార్తె దగ్గవోలు ఉమ (47) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి కాకాణి బద్దెవోలుకు వెళ్లి ఉమ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు యూఎస్‌కే రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, కసిరెడ్డి ధనుంజయ రెడ్డి, ఆవుల మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జనరంజక పాలన మళ్లీ రావాలి

ఇందుకూరుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలన మళ్లీ రావాలని జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పంబాల జనార్దన్‌రెడ్డి, కేతిరెడ్డి సతీష్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, మారుబోయిన సంతోష్‌గౌడ్, షేక్ షబ్బీర్, సర్పంచ్ నిరంజన్ నాథ్, ఏలూరు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు అక్షరాస్యతపై అవగాహన



ఓటరు అక్షరాస్యత పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నోడల్ ఆఫీసర్, అధ్యాపక బృందం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల ఆవరణలో ఓటరు అక్షరాస్యతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ పీవీ రత్నం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, ఎస్.మల్లేశ్వర్, ఎస్‌డీ మోసిన్, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి



సంగమేశ్వర కాలనీలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించి గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని వెంకన్నపాళెం గ్రామం, సంగమేశ్వర కాలనీల్లో బుధవారం రాత్రి మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు కాకాణికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లిబొల్లి మాటలు చెప్పి ఓట్లేయించుకుని అధికారంలోకి రావడం, ఆపై ప్రజలను వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మంత్రి దుయ్యబట్టారు. 2014 ఎన్నికల్లో 607 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిలో 6 హామీలను కూడా అమలు చేయలేదన్నారు. కాగా సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజల ముంగిటకే తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

వలంటీర్లపై ఏడుపెందుకు..?

గ్రామ వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు ఇస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోయాడని, వారిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ల సేవలను నిలిపివేయించాడని మంత్రి కాకాణి మండిపడ్డారు. చంద్రబాబు పుణ్యాన వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఎవరూ లేకే సోమిరెడ్డికి సీటు

నిన్నమొన్నటి వరకూ సోమిరెడ్డికి సర్వేపల్లి సీటును చంద్రబాబు కేటాయించలేదని, రకరకాల సర్వేలు చేయించి అనంతరం ఎవరూ ముందుకురాకపోవడంతో గతిలేకే సోమిరెడ్డికి టికెట్ ఇచ్చాడని మంత్రి అన్నారు. టికెట్‌ను అడ్డంపెట్టుకుని రూ.కోట్లు దండుకునేందుకు సోమిరెడ్డి ప్రయత్నాలు ప్రారంభించాడని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, నాయకులు ఏడెం మల్లికార్జునరెడ్డి, అడపాల మనోహర్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, చిట్టమూరు రాజశేఖర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్ రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కసిరెడ్డి ధనుంజయరెడ్డి, భాస్కర్‌గౌడ్, రవీంధర్‌రెడ్డి, కిషోర్‌నాయుడు, మహేంద్రవర్మ, నవకోటి, దయాకర్, రమేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఓటమి ఖాయం



పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పుతున్న విజయసాయిరెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని, టీడీపీ ఓటమి ఖాయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై విడవలూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పొన్నాడి చంద్రశేఖర్, ఆంనేయపురం టీడీపీ నాయకులు కొండూరు చంద్రశేఖర్, రామతీర్థం, పాటూరు గ్రామ నాయకులు వాకాటి సురేష్, నాటూరు శివయ్య, వావిళ్ల టీడీపీ నాయకులు నూనె అనంత్‌కుమార్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆవుల చలపతి, బుచ్చింగారి యానాదయ్యలతోపాటు వరిణి, దంపూరు, ఊటుకూరు గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు 1000 మంది వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.